# నమస్తే తెలంగాణ
# మహబూబాబాద్
5 | వరంగల్, సోమవారం 19 ఆగస్టు 2024 | MAHABUBABAD


## అర్హత ఉన్నా... రుణమాఫీ సున్నా


రెడ్డిపాలెంలో పాతిక శాతం మందికే మాఫీ

వరంగల్, ఆగస్టు 18 (నమస్తే తెలంగాణ) : అర్హత ఉన్నప్పటికీ అనేక మంది రైతులకు రుణమాఫీ వర్తించలేదు. అధిక శాతం గ్రామాల్లో మెజారిటీ రైతులు మూడు విడుతల్లోనూ రుణమాఫీకి నోచుకోలేకపోయారు. ఈ గ్రామాల్లో వరంగల్ జిల్లా గీసుగొండ మండలంలోని రెడ్డిపాలెం ఒకటి. ఇక్కడ రుణం పొందిన రైతుల్లో పాతిక శాతం మందికి మాత్రమే రుణమాఫీ జరిగింది. అర్హత కలిగినా తమకు రుణమాఫీ వర్తించకపోవడంతో మిగత డెబ్బై ఐదు శాతం మంది ఆందోళన చెందుతున్నారు. రెడ్డిపాలెం గ్రామంలో మొత్తం 92 మంది రైతులుండగా, వీరిలో 30 మంది పొరుగున ఉన్న మొగిలిచర్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(పీఏసీఎస్) నుంచి రుణం తీసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం విధించిన గడువులోపే రుణం తీసుకున్నందున తమకు మాఫీ వర్తిస్తుందని వారు మురిసిపోయారు. అయితే మూడు విడుతల్లో జరిగిన రుణమాఫీ జాబితాలో కేవలం 8 మంది పేర్లు మాత్రమే చోటుచేసుకున్నాయి. మిగతా 22 మందికి మాఫీ కాలేదు. తమకు అర్హతలన్నీ ఉన్నా మాఫీ జాబితాలో తమ పేర్లు ఉండకపోవటాన్ని ఈ రైతులు నిరసిస్తున్నారు. వడ్డీతో సహా లెక్కించినా ఈ 22 మంది రైతుల రుణం రూ.2 లక్షలు దాటడం లేదు. ఆధార్ నంబర్, పేరు వంటి తప్పులు లేవు. రేషన్‌కార్డు, ఒకే కుటుంబంలో ఒకరికే రుణమాఫీ, రూ. 2 లక్షల వరకు రుణమాఫీ తదితర నిబంధనలను పరిగణలోకి తీసుకున్నా వీరందరికీ అర్హత ఉన్నప్పటికీ రుణమాఫీ వర్తించకపోవటానికి కారణమేమిటనేది వీరికి అంతుచిక్కటం లేదు. ఇదే విషయమై మొగిలిచర్ల పీఏసీఎస్, వ్యవసాయశాఖ అధికారులను కలిశారు. రైతుల వద్ద ఉన్న రికార్డులు, ఆధారాలను పరిశీలించిన అధికారులు అర్హత ఉన్నందున ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని, రుణమాఫీ వర్తించనుందని చెబుతున్నారు. సర్కారు అర్హులకు రుణమాఫీ చేయకపోవటం మోసమని, తమకు న్యాయం జరిగే వరకు ఆందోళనలు చేస్తామని రైతులు తెలిపారు.

### కొందరికే మాఫీ..



మొగిలిచర్ల పీఏసీఎస్ ద్వారా రూ.1.40 లక్షల రుణం తీసుకున్న. ఇప్పటి వరకు వడ్డీతో లెక్కించినా రూ. 2 లక్షలు దాటలేదు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రుణమాఫీకి నేను అర్హుడిని. అయినా రుణమాఫీ కాలేదు. రెండు, మూడో విడుత జాబితాలోనూ నా పేరు లేదు. గీసుగొండ మండల వ్యవసాయ అధికారిని సంప్రదించగా ఆన్‌లైన్ ద్వారా పరిశీలించి అర్హత ఉందని, ఎలాంటి సమస్య లేనందున మీకు రుణమాఫీ వర్తిస్తుందని, ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉందని చెప్పారు. రుణం పొందిన రైతుల్లో అర్హుల జాబితాను అధికారులు ప్రభుత్వానికి పంపినా కొందరికి రుణమాఫీ చేసి మెజారిటీ రైతులకు మాఫీ చేయకపోవడం మోసం. అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలి.

– ముక్కల శ్రీనివాస్‌రెడ్డి, రైతు, రెడ్డిపాలెం

### మా ఊళ్లె చానమందికి కాలె..



పరకాల : సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన రైతు రుణమాఫీ అంతా మాయ. ఎవరికి మాఫీ అయితాందో తెలుస్తలేదు. నాకు రూ.2.05 లక్షలు రుణం ఉన్నది. రూ.2లక్షలు మాఫీ అయితే రూ.5వేలు కట్టి మళ్లీ రుణం తీసుకోవచ్చనుకున్న. తీరా జాబితాలో నా పేరు లేదు. ఇదేందని అడిగితే రూ.2 లక్షలలోపు రుణం ఉన్నోళ్లకే మాఫీ అయిందని చెబుతున్నరు. నా లెక్క రుణం మాఫీ కానోళ్లు మా ఊర్లో చాలామందే ఉన్నరు. కాంగ్రెస్ ప్రభుత్వం సగం మందికి కూడా రుణమాఫీ చేయలె. వ్యవసాయ అధికారుల దగ్గర కూడా సరైన సమాచారం లేదు. ఇదివరకు రూ.2 లక్షలపైన ఉన్న వారికి కూడా రూ.2లక్షల మాఫీ చేస్తమని చెప్పిండ్రు. అందరికీ రుణమాఫీ చేయకుంటే ఊరుకునేది లేదు. కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెబుతం.

– పల్లెబోయిన సురేశ్, రైతు, లక్ష్మీపురం, పరకాల మండలం


ములుగులోని గ్రీవెన్స్ వద్ద రైతుల రద్దీ

# రుణమాఫీ ఎప్పుడైతదో?

పావువంతు మందికి కూడా మాఫీ కాలేదని ఆందోళన

## రేవంత్ ప్రభుత్వంపై రగులుతున్న రైతులు

- కొంతమందికే ఎలా చేస్తారంటూ ఆగ్రహం
- అన్ని అర్హతలున్నా ఎందుకు వర్తించలేదంటూ ప్రశ్నలు
- సరైన సమాచారం ఇవ్వని అధికారులు
- క్షేత్రస్థాయి పరిశీలనలో రైతుల దీనస్థితి వెలుగులోకి..

అన్ని అర్హతలున్నా రైతులకు రుణమాఫీ కాలేదు. మూడు విడతల్లోనూ వారికి మోక్షం లభించలేదు. చాలా గ్రామాల్లో పావువంతు మందికి కూడా మాఫీ వర్తించలేదు. దీంతో రేవంత్ ప్రభుత్వంపై రైతులు రగిలిపోతున్నారు. తమకు రుణమాఫీ ఎప్పుడైతదో తెలియక ఆందోళన చెందుతున్నారు. కొంతమందికే రుణమాఫీ చేసి మిగిలిన వారిని ఎందుకు అన్యాయం చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి రూ. 2 లక్షలలోపు పంటరుణం తీసుకున్న వారినీ విస్మరించారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రుణమాఫీ అయ్యిందో? లేదో? తెలియక బ్యాంకులు, వ్యవసాయ అధికారుల వద్దకు వెళ్లి వివరాలు తెలుసుకుంటున్నారు. సరైన సమాచారం ఇవ్వకపోవడంతో ఆవేదన చెందుతున్నారు. షరతులు లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితి ఇలా ఉండగా, సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం పూర్తిస్థాయిలో మాఫీ చేశామంటూ ప్రకటిస్తున్నారు. ఈ నేపథ్యంలో 'నమస్తే తెలంగాణ' బృందం పలు గ్రామాలను సందర్శించగా రైతుల దీనస్థితి వెలుగులోకి వచ్చింది.

*- నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, ఆగస్టు 18*

### మాకు రుణమాఫీ కాలె



ములుగు : నా పేరు మీద, నా భార్య పేరు మీద జంగాలపల్లి యూనియన్ బ్యాంకులో రూ.లక్షా 70వేల రుణం ఉన్నది. మా ఇద్దరిలో ఒక్కరికి కూడా రుణమాఫీ కాలె. బ్యాంకు పోయి అడిగితే వ్యవసాయ అధికారులు ఆన్‌లైన్‌లో కొడుతే మాఫీ అయితదంటున్నరు. దేవుడా అంటూ ఇక్కడికి కట్టె పట్టుకొని వచ్చిన. వీళ్లను అడిగితే మా దగ్గర ఏమీ లేదు.. బ్యాంకుకు పోయి అడగమంటున్నరు. ఎవరిని అడుగాలో అర్థం కావడం లేదు. ముసలోన్నని చూడకుండా తిప్పించుకుంటున్నరు. ఇగ నాకు ఓపిక లేదు. అయితే మాఫీ అయితది.. లేకుంటే లేదు. దేవుడే దిక్కు.

– వేల్పుల సమ్మయ్య, రామయ్యపల్లి గ్రామం, ములుగు మండలం

### పోచారంలో 60 మందికే మాఫీ

**మరో 90 మందికి వర్తించని పథకం**

మహబూబాబాద్, (నమస్తే తెలంగాణ)/ పెద్దవంగర : రాష్ట్ర ప్రభుత్వం మూడు విడుతల్లో చేపట్టిన రుణమాఫీలో అర్హులైన వందలాది మంది రైతులకు మొండిచేయే దక్కింది. చేసేదేమీ లేక, ఎవరిని అడగాలో తెలియక, మాఫీ ఎప్పుడవుతుందోనని ఎదురు చూస్తున్నారు. బ్యాంక్, వ్యవసాయ అధికారులు సమాధానం చెప్పే పరిస్థితుల్లో లేరు. మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం పోచారం గ్రామంలో మొత్తం 220 మంది రైతులున్నారు. ఇందులో 150 మంది పంట రుణాలు తీసుకున్నారు. ఇందులో మొదటి విడతలో 30 మంది, రెండో విడతలో 20, మూడో విడతలో 10, మొత్తం 60 మంది రైతులకు మాత్రమే మాఫీ వర్తించింది. మిగిలిన 90 మందికి రుణమాఫీ కాలేదు. తమకెందుకు మాఫీ కాలేదని బ్యాంకులు, వ్యవసాయ శాఖ అధికారుల చుట్టూ తిరుగుతున్నా సరైన సమాధానం రావడం లేదు. అసలు తమకు రుణమాఫీ అయితదా? కాదా? అని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం అన్ని అర్హతలున్న తమకు రుణమాఫీ చేయాలని కోరుతున్నారు.

### జాబితాలో నా పేరు లేదు..



నేను 2021లో పెద్దవంగర బ్యాంకులో రూ. 2 లక్షల పంట రుణం తీసుకున్న. ఎన్నికల ముందు కాంగ్రెస్ రుణమాఫీ ప్రకటిస్తే సంబురపడ్డ. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన లిస్టులో నా పేరు రాలేదు. ఎవరిని అడగాలో తెలియడం లేదు. ప్రభుత్వం చేసిన రుణమాఫీ అంత గందరగోళంగా ఉంది. చేస్తే అందరికీ చేయాలె.. లేకుంటే లేదు.. కానీ ఇట్ల గోస పెట్టొద్దు. నేను రైతును కాదా? పంట కోసం అప్పు తీసుకున్నోళ్లందరికీ మాఫీ చేయాలె. పాత సర్కారోళ్లు చెప్పిన కాడికి అందరికీ రుణమాఫీ చేసిండ్రు. వీళ్లు మాత్రం కొందరికే ఇచ్చి మిగిలినోళ్లకు ఇయ్యమంటే బాగుండదు. మా బాధలను అర్థం చేసుకొని అప్పు మాఫీ చేయాలె.

–తోట విజయ, పోచారం గ్రామం, పెద్దవంగర మండలం

### చేస్తే అందరికీ చేయాలె..



ములుగురూరల్ : ప్రభుత్వం రుణమాఫీ అని చెప్పి కొంత మందికే మాఫీ చేస్తే ఎట్లా? మా లాంటి వారి పరిస్థితి ఏంది కావచ్చు మరి? బ్యాంకులో మేము రూ.2లక్షల రుణం తీసుకున్నాం. మొన్న బ్యాంకుకు పోయి అడిగితే మొత్తం రూ.2లక్షల 20వేలు ఉందని బ్యాంకు అధికారులు తెలిపారు. మీది పైసలు కడుతామని చెప్పినా రుణమాఫీ వర్తించదని అన్నారు. అందరు రైతులను సమానంగా చూసినప్పుడే రుణమాఫీ జరిగినట్లు చెప్పాలి. ఎక్కడిపోయినా పట్టించుకునే వారు లేరు. తిరిగి తిరిగి గోస పడినం. రైతులకు మేలు చేయాలనే ఆలోచన ఉంటే ఇలా జరుగుదు. కొందరికే రుణ మాఫీ అయితే మిగతా వారు రైతులు కాదన్నట్లా?

– కన్నబోయిన రాజక్క, జంగాలపల్లి, ములుగు


మహదేవపూర్‌లోని వ్యవసాయాధికారి కార్యాలయం

### రూ.లక్ష రుణం మాఫీ కాలేదు



నర్సంపేట : నాకు 5 ఎకరాల భూమి ఉంది. గ్రామంలోని ఐవోబీలో 2019లో రూ. లక్ష రుణం తీసుకున్నా. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన రైతు రుణమాఫీ జాబితాలో నా పేరు లేదు. బ్యాంకు, వ్యవసాయ అధికారుల చుట్టూ తిరిగినా ఎవరూ సమాధానం చెప్పడం లేదు. ఐవోబీలో 886 మంది రైతులకు ఇంకా రుణమాఫీ కాలేదు. వెంటనే ఉన్నతాధికారులు జరిగిన తప్పిదాన్ని సరిచేసి అర్హత ఉన్న రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలి. తిరిగి కొత్త రుణాలు ఇచ్చి ఆదుకోవాలి. పూర్తిగా రుణమాఫీ చేసినట్లు ప్రభుత్వం ప్రచారం చేస్తున్నా, గ్రామాల్లో ఆ పరిస్థితి లేదు. రుణమాఫీలో చాలాలోపాలు ఉన్నాయి. ప్రభుత్వం సరిచేయాలి.

– చీకటి శ్రీనివాస్, రైతు, అలంకానిపేట

## ఆత్మీయతకు ప్రతిరూపం
# రక్షాబంధన్

**నేడు రాఖీ పౌర్ణమి**


హనుమకొండ టైలర్స్ స్ట్రీట్‌లో రాఖీలు కొనుగోలు చేస్తున్న మహిళలు

నమస్తే నెట్‌వర్క్ : సోదర సోదరీమణుల మధ్య ఆత్మీయత, ఆప్యాయతలకు ప్రతీక రాఖీ పండుగ. అమ్మలోని అనురాగం.., నాన్నలోని ప్రేమ కలగలిపిన బంధం ఇది. అన్నా, తమ్ముళ్లకి రాఖీ కట్టి నిత్యం సంతోషంగా, ఆరోగ్యంగా ఉండాలని అక్కా చెల్లెళ్లు కోరుకుంటారు. అలాగే సోదరులు కూడా వారికి ఎల్లవేళలా తోడుగా ఉంటారని భావిస్తారు. సోమవారం రాఖీ పౌర్ణమి వేడుకలను ఘనంగా జరుపుకునేందుకు ఆడపడుచులు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. ఈ క్రమంలో రంగురంగుల రాఖీలు, మిఠాయిలు కొనుగోళ్లు, అమ్మకాలతో హనుమకొండ జిల్లా టైలర్స్ స్ట్రీట్ సందడిగా మారింది.

## వికసించిన రాఖీ పుష్పం



రక్షాబంధన్‌ను సోమవారం జరుపుకుంటుండగా, రెండు రోజుల ముందుగానే రాఖీ పుష్పం వికసించింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా గుడాడ్‌పల్లి గ్రామానికి చెందిన తక్కళ్లపలి సంజీవరావు తీగ జాతికి చెందిన ఈ మొక్కను పదేళ్ల నుంచి పెంచుతున్నాడు. అచ్చం రాఖీని పోలిన పూలు పూసి గ్రామస్తులకు ఆహ్లాదాన్ని పంచుతున్నది.

*- ఫొటోగ్రాఫర్, జయశంకర్ భూపాలపల్లి*

## బహుజన వీరుడు పాపన్న

- ఉమ్మడి జిల్లాలో ఘనంగా జయంతి వేడుకలు
- పరకాల, ములుగులో పాల్గొన్న మంత్రులు పొంగులేటి, సీతక్క
- జనగామలో హాజరైన ఎమ్మెల్యే పల్లా


సర్దార్ సర్వాయి పాపన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి

నమస్తే నెట్‌వర్క్ : తెలంగాణ బహుజన వీరుడు, ఆత్మగౌరవానికి, ధీరత్వానికి ప్రతీక సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని వక్తలు అన్నారు. ఆదివారం ఆయన జయంతి వేడుకలు ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరుగగా, అధికారులు, ప్రజాప్రతినిధులు, గౌడ కులస్తులు పాల్గొని ఘన నివాళులర్పించారు. హనుమకొండ జిల్లా పరకాల, ములుగు జిల్లా కేంద్రంలో జరిగిన కార్యక్రమాల్లో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క పాల్గొని గౌడ కులస్తులకు కాటమయ్య కిట్స్ పంపిణీ చేశారు. జనగామలో జరిగిన వేడుకల్లో స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పాల్గొని పాపన్న చిత్రపటం వద్ద నివాళులర్పించారు. హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ పాల్గొన్నారు.



### రన్ ఫర్ నో డ్రగ్స్..

'సే నో టు డ్రగ్స్' పేరిట వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా ఆధ్వర్యంలో ఆదివారం 4కే రన్ నిర్వహించారు. కమిషనరేట్ పరేడ్ మైదానం నుంచి అదాలత్ వరకు నిర్వహించిన కార్యక్రమం లో హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు ప్రావీణ్య, సత్యశారద, ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి పాల్గొని పరుగెత్తారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు.

*- సుబేదారి, ఆగస్టు 18*



వేయి పదాల భావాన్ని ఒక ఫొటో చెబుతుంది. ఏదైనా అందమైన చిత్రం కనబడితే వెంటనే ఫొటో తీయాలనిపిస్తుంది. అది ఎల్లకాలం పదిలంగా ఉంటుంది. ఎన్నో జ్ఞాపకాలను సజీవంగా ఉంచుతుంది. నిత్య జీవితంలోని సంఘటనలకు నిలువెత్తు సాక్ష్యం ఫొటో మాత్రమే. నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం.

*- ఫొటో గ్రాఫర్, వరంగల్*

















